


# ఫైనల్లో ముంబై

**ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై ఘన విజయం • మెరిసిన మాథ్యూస్, సీవర్ బ్రంట్**

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఎలిమినేటర్ పోరులో ముంబై 47 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. తద్వారా రెండోసారి ముంబై ఫైనల్ పోరులో నిలిచింది. ఈనెల 15న తుది పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై తలపడనుంది. తొలుత హిలీ మాథ్యూస్(50 బంతుల్లో 77, 10ఫోర్లు, 3సిక్స్‌లు), నాట్ సీవర్‌బ్రంట్(41 బంతుల్లో 77, 10ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 213/4 స్కోరు చేసింది. 26 పరుగులకే భాటియా(15) వికెట్ కోల్పోయిన ముంబైని మాథ్యూస్, బ్రంట్ ఆదుకున్నారు. ఒకరిని మించి మరొకరు బౌండరీలు బాదడంతో ముంబైకి భారీ స్కోరు సాధ్యమైంది. రెండో వికెట్‌కు వీరిద్దరు కలిసి 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(12 బంతుల్లో 36, 2ఫోర్లు, 4సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ముంబై 200 మార్క్ అందుకుంది. లక్ష్యఛేదనలో గుజరాత్ 19.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. గిబ్సన్(34)టాప్ స్కోరర్‌గా నిలిచింది. మాథ్యూస్(3/31), కెర్(2/28) రాణించారు.

## భారత సెయిలింగ్ టీమ్‌లో మనోళ్లు

**సింగపూర్ టోర్నీకి లాహిరి, వినోద్, రిజ్వాన్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సింగపూర్ యూత్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో పోటీపడే భారత జట్టుకు హైదరాబాద్‌కు చెందిన కొమరవెల్లి లాహిరి, దండు వినోద్, మహమ్మద్ రిజ్వాన్ ఎంపికయ్యారు. ఈనెల 14 నుంచి సింగపూర్‌లోని నేషనల్ సెయిలింగ్ సెంటర్‌లో జరిగే ఈ టోర్నీలో 25 దేశాల నుంచి 200 మంది పోటీపడుతున్నారు. అండర్-15 ఆప్టిమిస్టిక్ క్లాస్ బోట్స్ విభాగంలో లాహిరి, రిజ్వాన్ బరిలోకి దిగుతున్నారు. వీరికి తో శ్రేయా కృష్ణ, సమృద్ధి బాథమ్..భారత జట్టుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కే చెందిన సుహేమ్ షేక్, టీమ్ మేనేజర్‌గా ధరణి లావేటి వ్యవహరించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సెయిలర్లు..కొంపల్లిలోని సుచిత్రా అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. యాచ్ క్లబ్‌లో నాణ్యమైన డైట్, యోగా సాధనతో మెరుగైన ఫిట్‌నెస్ సాధించామని లాహిరి, రిజ్వాన్ పేర్కొన్నారు.

## క్వార్టర్స్‌కు లక్ష్యసేన్

- మాళవిక ఓటమి



బర్మింగ్‌హామ్: భారత యువ షట్లర్ లక్ష్యసేన్ ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో లక్ష్య 21-13, 21-10తో ప్రపంచ రెండో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా)కు షాకిచ్చాడు. పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో లక్ష్య 36 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేశాడు. తొలి గేమ్ బ్రేక్ సమయానికి 7-11తో వెనుకబడ్డ అతడు.. ఆ తర్వాత పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లను గెలుచుకుని క్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. మహిళల సింగిల్స్ బరిలో నిలిచిన యువ షట్లర్ మాళవిక బన్సోద్ పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. బన్సోద్ 16-21, 13-21తో ప్రపంచ మూడో ర్యాంకర్ మయగుచి (జపాన్) చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక-రోహన్ జంట 10-21, 12-21తో ఫెంగ్ యాన్ జి- వీ యాక్సిన్ చేతిలో చిత్తయ్యారు.

# 18వ సారైనా

**18వ సారైనా.. స్టార్ ప్లేయర్లకు కొదవలేదు.. ఆటగాళ్ల పోరాట స్ఫూర్తి గురించి అనుమానమే అక్కర్లేదు.. అభిమానుల అండ ఆశించిన దానికంటే ఎక్కువ.. ఆకర్షణ పరంగా చూస్తే దేశంలో ఎక్కడ ఆడినా స్టేడియాలు నిండాల్సిందే.. ప్రపంచంలోనే మేటి బ్యాటర్లు, దిగ్గజ బౌలర్లు ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించినా ఐపీఎల్ ఆరంభ సీజన్ మొదలుకుని నిరుడు ముగిసిన 17వ సీజన్ దాకా ఆ జట్టు ఒక్కటంటే ఒక్క కప్పు కూడా గెలవలేదు. ఆరు సార్లు ప్లేఆఫ్స్, మూడు సార్లు రన్నరప్ అయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు ఈ సీజన్ మరెంతో ప్రత్యేకం. ఢిల్లీలో పుట్టిపెరిగినా బెంగళూరు దత్తపుత్రుడైన కోహ్లీ (జెర్సీ నంబర్ 18).. ఐపీఎల్ టైటిల్ కల 18వ సీజన్‌లో అయినా నెరవేరుతుందా?**






*నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆరంభ సీజన్ నుంచి బరిలో ఉండి ఇప్పటి దాకా టైటిల్ నెగ్గని మూడు జట్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ముందు వరుసలో ఉంటుంది. ఈ జాబితాలో ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ సైతం ఉన్నప్పటికీ ఆర్‌సీబీ ఆకర్షణ, స్టార్ ప్లేయర్లు, అభిమానుల మద్దతు ప్రకారం చూస్తే.. మిగిలిన జట్ల కంటే ఎన్నో రెట్లు ముందుంటుంది. అయితే 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్టు ఆ జట్టు ఇప్పటిదాకా ఒక్కసారీ కప్పు కలను నెరవేర్చుకోలేదు. ప్రతి సీజన్ ఆరంభానికి ముందు 'ఈసాలా కప్ నమ్దే' అంటూ హంగామా చేసి అభిమానులకు నిరాశను మిగుల్చుతున్న బెంగళూరు 18వ సీజన్‌లో అయినా టైటిల్ నిరీక్షణకు తెరదించాలని భావిస్తోంది. అదే ఫ్రాంచైజీకి చెందిన స్మృతి మంధాన సారథ్యంలోని ఆర్‌సీబీ.. గత సీజన్‌లో కప్పు కొట్టడం అబ్బాయిలను మరింత ఒత్తిడికి లోనుచేస్తోంది. అన్నింటికీ మించి ఆ జట్టు దిగ్గజం విరాట్ కోహ్లీకి ఈ సీజన్ అత్యంత ప్రత్యేకం. కోహ్లీ జెర్సీ నంబర్ 18 కాగా ఐపీఎల్‌లో ఇది 18వ సీజన్. మరి కొత్త కెప్టెన్ రజత్ పాటిదార్ ఈసారైనా కన్నడిగుల 'కప్ నమ్దే' ఆశలను నెరవేరుస్తాడా? తన అభిమాన క్రికెటర్ కోహ్లీకి కప్పును కానుకగా ఇస్తాడా?

### రజత్ సారథ్యంలో..

రాహుల్ ద్రావిడ్, కెవిన్ పీటర్సన్, అనిల్ కుంబ్లే, డేనియల్ వెటోరీ, విరాట్ కోహ్లీ, షేన్ వాట్సన్, ఫాఫ్ డుప్లెసిస్.. అంతర్జాతీయ క్రికెట్‌లో హేమాహేమీలుగా పేరొందిన ఈ దిగ్గజాలు సారథ్యం వహించిన ఆర్‌సీబీ ఈ సీజన్‌లో జట్టును పూర్తిగా ప్రక్షాళన చేసింది. ఆ జట్టు చరిత్రలో తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో అనుభవం లేని దేశవాళీ క్రికెటర్ రజత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు కట్టబెట్టింది. సారథ్య రేసులో కోహ్లీ ఉన్నా అతడు అందుకు విముఖత చూపడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా రజత్‌కు నాయకత్వ పగ్గాలు అప్పజెప్పింది. ఈ నిర్ణయం ఆ జట్టు ట్యాగ్‌లైన్ 'ప్లే బోల్డ్'ను సూచించేదే. అంతర్జాతీయ స్థాయిలో అనుభవం లేకున్నా రజత్‌కు దేశవాళీలో మధ్యప్రదేశ్ జట్టును విజయవంతంగా నడిపించిన అనుభవముంది. 2021 నుంచి బెంగళూరుకు ఆడుతున్న అతడికి జట్టులో ప్రతి ఆటగాడితోనూ సత్సంబంధాలున్నాయి. సీనియర్ కోహ్లీ నుంచి అతడికి పూర్తి మద్దతు ఉంటుందనడంలో సందేహమే లేదు. రజత్ నియామకం కంటే ముందే బెంగళూరు.. తమ ఆస్థాన బౌలర్ సిరాజ్‌తో పాటు గత మూడు సీజన్లలో ఆ జట్టుకు ఆడిన గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను రిటైన్ చేసుకోకపోగా వారిని రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం)లో కూడా పట్టించుకోలేదు. వాళ్లను పక్కన బెట్టిన ఆర్‌సీబీ ఈసారి వేలంలో వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మ (రూ. 11 కోట్లు), ఫిల్ సాల్ట్ (రూ. 11.50 కోట్లు), భువనేశ్వర్ కుమార్ (రూ. 10.75 కోట్లు), లివింగ్‌స్టన్ (రూ. 8.75 కోట్లు)ను భారీ ధరతో దక్కించుకుంది. రసిక్ ధార్, స్వప్నిల్, సుయాశ్ శర్మ వంటి దేశవాళీ ప్రతిభావంతులు ఆ జట్టు సొంతం.

### కూర్పు కుదిరేనా..?

గత సీజన్‌లో కేకేఆర్ ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించిన సాల్ట్ ఈసారి బెంగళూరుకు ఆడనుండటం ఆ జట్టుకు లాభించేదే. కోహ్లీతో కలిసి అతడు ఓపెనింగ్ చేసే అవకాశాలున్నాయి. ఆ తర్వాత పడిక్కల్, రజత్, జితేశ్ వచ్చినా ఆఖర్లో మెరుపులు మెరిపించేందుకు డేవిడ్, లివింగ్‌స్టన్ రూపంలో పటిష్టంగా ఉంది.

**ఐపీఎల్‌లో ఆర్‌సీబీ**

| | |
|---|---|
| 2009, 2011, 2016 | రన్నరప్ |
| 2010, 2020, 2021, 2022, 2024 | ప్లేఆఫ్స్ |

### అంతా ఆ ఒక్కడి మీదే..

బెంగళూరు బలం, బలహీనత కోహ్లీనే. 17 సీజన్లలో ఒకే ఫ్రాంచైజీ తరఫున నిరాటంకంగా 267 మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు (8,428) చేసిన క్రికెటర్‌గా ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. 8 శతకాలు, 57 అర్ధ శతకాలు అతడి సొంతం. లెక్కకు మిక్కిలి రికార్డులు కోహ్లీ ఖాతాలో ఉన్నాయి. కానీ కోహ్లీ తర్వాత ఆ జట్టు తరఫున భారత్ నుంచి వెయ్యి పరుగులు దాటిన బ్యాటర్ ఒక్క ద్రవిడ్ (1,132) మాత్రమే. ఈ 17 ఏండ్లలో ఎంతో మంది ఆర్‌సీబీ తరఫున ఆడినా నిలకడలేమితో విఫలమవుతున్నారు. పడిక్కల్ (884), పాటిదార్ (799) ఈ సీజన్‌లో అయినా ఆ లోటును పూడుస్తారేమో చూడాలి. కీలక మ్యాచ్‌లలో కోహ్లీ ఔట్ అయితే మిగిలిన బ్యాటింగ్ లైనప్ అంతా పెవిలియన్‌కు క్యూ కట్టడాన్ని నియంత్రిస్తే బెంగళూరుకు తిరుగుండదు. బ్యాటింగ్ బలంగా ఉన్నా బెంగళూరు బెంగ అంతా బౌలింగే. కానీ ఈసారి భువనేశ్వర్ వంటి సీమర్ చేరడం ఆ జట్టు పేస్ దళాన్ని పటిష్ఠం చేసేదే అయినా మిగతా స్టేడియాలతో పోల్చితే చిన్నగా ఉండే చిన్నస్వామిలో అతడు ఏ మేరకు విజయవంతమవుతాడనేది ఆసక్తికరం. హెజిల్‌వుడ్ గాయం కారణంగా ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడనేదీ స్పష్టత లేకపోవడం బెంగళూరును ఆందోళనకు గురిచేసేదే. గత సీజన్‌లో ఫర్వాలేదనిపించిన యశ్ దయాల్ 2025లోనూ రాణించడం ఆర్‌సీబీకి అత్యావశ్యకం.




**మరో 8 రోజుల్లో**

## బ్రూక్‌పై రెండేండ్ల నిషేధం



ముంబై: ఇంగ్లండ్ యువ క్రికెటర్ హ్యారీ బ్రూక్‌పై ఐపీఎల్‌లో రెండేండ్ల నిషేధం పడింది. 2024 వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ బ్రూక్‌ను రూ. 6.25 కోట్లకు దక్కించుకోగా వరుసగా రెండు సీజన్ల ఆరంభానికి ముందు అతడు పలు కారణాలతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. దీంతో ఐపీఎల్ పాలకమండలి బ్రూక్‌పై కఠిన చర్యలకు దిగింది. తాజా నిర్ణయంతో బ్రూక్.. 2027 దాకా ఐపీఎల్‌కు దూరమవనున్నాడు.


## బాంబ్రీ జోడీ నిష్క్రమణ

కాలిఫోర్నియా: ఇండియానా వెల్స్ ఓపెన్‌లో భారత టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీ, తన స్వీడన్ సహచరుడు ఆండ్రే గొరన్సన్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. గురువారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఈ ఇండో-స్వీడన్ ద్వయం.. 6-7 (5/7), 6-3, 8-10తో స్మిత్ (ఆస్ట్రేలియా)-ఫెర్నాండో (బ్రెజిల్) చేతిలో ఓటమిపాలైంది.

## ఏడుగురు సభ్యులతో కమిటీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బీసీసీఐ ఆదేశాల మేరకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ)కు సంబంధించి అంశాలు అర్థం చేసుకోవడం, వాటి పరిష్కారానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఏడుగురు సభ్యులతో సబ్‌కమిటీ ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు ఇటీవల చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత జట్టుకు మేనేజర్, ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించిన దేవరాజ్, దిలీప్‌కు హెచ్‌సీఏ చెరో 10 లక్షల నజరానా ప్రకటించింది.

# చందూ మొండేటి దర్శకత్వంలో?



హీరో రామ్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం రాజమండ్రిలో షూటింగ్ జరుగుతున్నది. ఇదిలావుండగా తాజాగా రామ్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. దీనిని చందు మొండేటి డైరెక్ట్ చేస్తారని సమాచారం. ఇటీవల 'తండేల్'తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు చందూ మొండేటి. ఆయన తదుపరి చిత్రాన్ని తమిళ హీరో సూర్యతో చేయాల్సి ఉంది. కథా చర్చలు కూడా పూర్తయ్యాయి. అయితే ప్రస్తుతం సూర్య వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన డేట్స్ కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈలోగా రామ్‌తో ఆయన సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిసింది. ఇటీవలే రామ్‌ని చందూ మొండేటి కలిసి ఓ కాన్సెప్ట్ చెప్పారని, అది బాగా నచ్చడంతో రామ్ సినిమా చేయడానికి ఉత్సాహంగా ఉన్నారని ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సినిమా పూర్తయ్యాక చందూ మొండేటి సినిమా పట్టాలెక్కే అవకాశముందని సమాచారం.

చిత్రం



## 'రెట్రో' కోసం సొంత డబ్బింగ్

సమకాలీన కథానాయికల్లో చాలా మంది తమ సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తెరపై పాత్ర సహజంగా కనిపించడంతో పాటు అభిమానులకు కూడా మరింత చేరువకావొచ్చనే ఉద్దేశ్యంతో ఓన్ డబ్బింగ్‌కే ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటికే రష్మిక మందన్న, కీర్తి సురేష్ వంటి అగ్రతారలు డబ్బింగ్ కోసం సొంత గళాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు వీరి వరుసలో పూజాహెగ్డే చేరింది. ప్రస్తుతం ఈ భామ తమిళంలో సూర్య సరసన 'రెట్రో' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకుడు. మే నెలలో విడుదలకానుంది. ఈ సినిమా కోసం పూజాహెగ్డే తమిళంలో సొంతంగా డబ్బింగ్ చెప్పింది. కెరీర్ తొలిసారి తాను సొంతంగా డబ్బింగ్ చెప్పడం ఆనందంగా ఉందని, ఇక ముందు అన్ని భాషల్లో ఇదే పద్ధతి ఫాలో అవుతానని పూజాహెగ్డే పేర్కొంది. తెలుగు సినిమాల్లో కూడా ఆమె ఓన్ డబ్బింగ్ చెప్పేందుకు సముఖంగా ఉందని తెలిసింది. గతకొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న పూజాహెగ్డే ప్రస్తుతం తమిళ ఇండస్ట్రీపైనే దృష్టి పెట్టింది. అక్కడ సూర్య 'రెట్రో', దళపతి విజయ్ 'జన నాయగన్', రాఘవ లారెన్స్ 'కాంచన-4' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమాలు దక్షిణాదిన తనకు పూర్వ వైభవం తెచ్చిపెడతాయని ధీమా వ్యక్తం చేస్తున్నది పూజాహెగ్డే.

# రాయలసీమ నేపథ్య కథలో..




కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్ కోసం ఎదురు చూస్తున్నారు యువ హీరో అక్కినేని అఖిల్. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో సక్సెస్‌కాకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. ప్రస్తుతం అఖిల్ స్వీయ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఓ చిత్రాన్ని చేస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకుడు. ఇటీవలే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. నేటి నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్లు తెలిసింది. రాయలసీమ నేపథ్యంలో పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. అధికభాగం చిత్తూరు జిల్లాలో షూటింగ్ చేస్తారట. శ్రీలీలను కథానాయికగా తీసుకునే అవకాశముందని తెలిసింది. ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్‌ను పెట్టబోతున్నారని వార్తలొస్తున్నాయి. దసరా బరిలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# నాని జడ్జిమెంట్‌నే నమ్ముతాం




హీరో నాని స్వీయ నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా ప్రజెంట్ చేస్తున్న చిత్రం 'కోర్ట్-స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి రామ్ జగదీష్ దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాతగా, నాని సోదరి దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం నిర్మాతలిద్దరూ పాత్రికేయులతో ముచ్చటించారు. దీప్తి గంటా మాట్లాడుతూ 'నాని, ప్రశాంతి ఈ స్క్రిప్ట్‌ను ఓకే చేశారు. ఆ తర్వాత నేను ఈ ప్రాజెక్ట్‌లో జాయిన్ అయ్యాను. ప్రతీ రోజు సెట్‌లో ఉండేదాన్ని. పోక్సో చట్టం నేపథ్యంలో దర్శకుడు ఎంతగానో పరిశోధించి అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ కథలో ఎన్నో లేయర్స్ కనిపిస్తాయి. ప్రతి సన్నివేశం చాలా సహజంగా అనిపిస్తుంది. ప్రియదర్శితో పాటు రోహిణి, సాయికుమార్, శివాజీ వంటి సీనియర్ నటులు ఉండటం వల్ల కథలో మంచి ఎమోషన్ పండింది' అని చెప్పారు. 'మీట్ క్యూట్' వెబ్‌సిరీస్ తర్వాత తాను అమెరికా వెళ్లిపోయానని, 'కోర్ట్' సినిమా కోసమే మళ్లీ ఇండియా వచ్చానని, ప్రస్తుతం తన దగ్గర కొన్ని ఐడియాలున్నాయని, అన్నీ కుదిరితే డైరెక్షన్ చేస్తానని దీప్తి గంటా పేర్కొన్నారు. ప్రశాంతి తిపిర్నేని మాట్లాడుతూ 'వాల్‌పోస్టర్ బ్యానర్‌లో నాని, నేను ఇద్దరం కథలు వింటాం. నానినే తుది నిర్ణయం తీసుకుంటారు. కథల ఎంపికలో నాని జడ్జిమెంట్‌కు తిరుగుండదని మేము నమ్ముతాం. ఓ సాధారణ ప్రేక్షకుడి దృష్టికోణంలో ఆయన కథను చూస్తారు. ఈ సినిమా ప్రీమియర్స్‌కు అంతటా సూపర్ రెస్పాన్స్ వస్తున్నది. ప్రీమియర్‌షోస్‌కు కొందరు లాయర్స్ కూడా వచ్చారు. ఈ సినిమా విజయంపై పూర్తి కాన్ఫిడెంట్‌తో ఉన్నాం' అని తెలిపారు.

## 36ఏండ్ల బ్రహ్మచారి కథ




సప్తగిరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్ రెడ్డి దర్శకుడు. ఈ నెల 21న విడుదలకానుంది. దిల్‌రాజు ప్రొడక్షన్ హౌజ్ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నది. గురువారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 36ఏళ్లు దాటిన ప్రసాద్ పెళ్లి గురించి టెన్షన్ పడుతుంటాడు. ఏజ్‌బార్ అయినప్పటికీ పెళ్లికి ఇబ్బంది కాదని తండ్రి అతనికి ధైర్యాన్నిస్తుంటాడు. మరింత ఆలస్యం జరిగితే ఇక పెళ్లికి అవకాశం ఉండదేమోనని ప్రసాద్ భయం. మరోవైపు తమ కుటుంబాన్ని మొత్తం పోషించే వరుడి కోసం అన్వేషిస్తుంటుంది హీరోయిన్ ఫ్యామిలీ. ఈ నేపథ్యంలో హిలేరియస్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్రబృందం చెప్పింది. పెళ్లికాని ప్రసాద్ పాత్రలో సప్తగిరి తనదైన హాస్యంతో ఆకట్టుకున్నాడు. ప్రియాంకశర్మ, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణ సంస్థ: థామ మీడియా, విజన్ గ్రూప్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అభిలాష్ రెడ్డి గోపిడి.

## అహంకారం అంతమవుతుంది



స్వీయ నిర్మాణంలో విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న 25వ చిత్రం 'భద్రకాళి'. అరుణ్‌ప్రభు దర్శకుడు. గురువారం టీజర్‌ను విడుదల చేశారు. 'పిల్లి కూడా ఓ రోజు పులి అవుతుంది. అబద్ధం, అహంకారం అంతం అవుతుంది' అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. గ్యాంగ్‌స్టర్, ఫ్యామిలీ నేపథ్య సన్నివేశాలతో ఉత్కంఠను పంచింది. విజయ్ ఆంటోని పాత్ర సస్పెన్స్‌గా అనిపించింది. ఆయన స్టైలిష్‌గా కనిపించారు. 190కోట్ల కుంభకోణం చుట్టూ నడిచే కథ ఇదని, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని, విజయ్ ఆంటోని పాత్ర డిఫరెంట్ షేడ్స్‌తో సాగుతుందని మేకర్స్ తెలిపారు. వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, రచన-దర్శకత్వం: అరుణ్‌ప్రభు.

## బ్రిటిష్ పాలనపై పోరాటం



యువ హీరో రోషన్ నటిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. గురువారం రోషన్ పుట్టిన రోజు సందర్భంగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన్ని ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పరిచయం చేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ మైదానంలో, జీవితంలో నిజమైన ఛాంపియన్‌గా నిలవడానికి అతను చేసే ప్రయత్నాన్ని ఆవిష్కరించారు. రోషన్ పవర్‌ఫుల్ లుక్స్‌తో కనిపించారు. మిక్కీ జే మేయర్ నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాణం: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, దర్శకత్వం: ప్రదీప్ అద్వైతం.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.